www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


ప్రసంగిస్తున్న దింగాలేశ్వరస్వామి

ప్రహ్లాద్‌జోషికి ఓటు వేయకండి

● ప్రచారంలో దింగాలేశ్వరస్వామి


బెంగళూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి ఓటు వేయరాదని ఆయనకు ప్రత్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి విరమించుకున్న శిరహట్టి మఠం ఫకీర్ దింగాలేశ్వరస్వామి పిలుపునిచ్చారు. శనివారం ధారవాడ జిల్లా కుందగోళలో భారీ బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోషిని ఇంటికి పంపేవరకు మెడలో మాల వేసుకునేది లేదని సవాల్ చేశారు. ఇప్పటికే పలుమార్లు బహిరంగంగా సవాల్ చేశానన్నారు. ప్రహ్లాద్‌జోషిని ఓడించడమే తన లక్ష్యమన్నారు. సమాజానికి మంచి చేసేవారికే మద్దతు ఇస్తామన్నారు. లింగాయతల పట్ల నిరంతరంగా నిర్లక్ష్యం చేసినవారికి తగిన గుణపాఠం చెప్పాలన్నదే నా లక్ష్యమన్నారు.

హొళెనరసీపుర ఎమ్మెల్యే రేవణ్ణ

అరెస్ట్



● రాసలీలల కేసులో కీలక మలుపు
● కూటమి నేతల్లో కలకలం
● 30 ఏళ్ల కిందట ఇంగ్లండ్‌లో రేవణ్ణకు ఇదే పరిస్థితి : మాజీ ఎంపీ శివరామేగౌడ



బెంగళూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రాసలీలల వ్యవహారంలో ఏ1గా ఉన్న తండ్రి, హొళెనరసీపుర జేడీఎస్ ఎమ్మెల్యే రేవణ్ణను శనివారం సాయంత్రం అరెస్టు చేశారు. ప్రజ్వల్, రేవణ్ణలపై పనిమనిషి ఫిర్యాదుతో హొళెనరసీపురలో తొలి కేసు నమోదైంది. ఆ పనిమనిషిని ఏప్రిల్ 29న కిడ్నాప్ చేశారని ఆమె కుమారుడు మైసూరు జిల్లా కేఆర్‌పేటలో ఫిర్యాదు చేశారు. కేసు విచారణ జరుపుతున్న సిట్ అధికారులు నోటీసులు జారీ చేయగా ముందస్తు బెయిల్‌కోసం రేవణ్ణ ప్రజా ప్రతినిధుల కోర్టును ఆశ్రయించారు. రెండు రోజులుగా సాగిన విచారణ అనంతరం శనివారం సాయంత్రం న్యాయమూర్తి తీర్పు ప్రకటించారు. బెయిల్ పిటీషన్‌ను తిరస్కరించిన ధర్మాసనం కేసును ఈనెల 6కు వాయిదా వేసింది. రేవణ్ణపై దాఖలైన తొలి కేసులో బెయిల్ సెక్షన్‌లు ఉన్నాయి. అయితే బాధితురాలి కిడ్నాప్ చేసిన అంశం కీలకం కావడంతో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్ ఇవ్వరాదని వాదనలు వినిపించారు.

క్షణాల్లో పద్మనాభనగర్‌కు సిట్ బృందాలు రేవణ్ణకు ముందస్తు బెయిల్ తిరస్కరణ కావడంతో సిట్ ఎస్పీ సీమాలాట్కర్ నేతృత్వంలోని అధికారులు పద్మనాభనగర్‌కు చేరుకున్నారు. మాజీ ప్రధాని దేవెగౌడ నివాసంలో రేవణ్ణ ఉన్నట్లు నిర్ధారించుకుని బయటకు రావాలని సూచించారు. సుమారు అరగంటకుపైగా ఎవరూ స్పందించలేదు. చివరకు రేవణ్ణ బయటకు రావడంతో అరెస్టు చేస్తున్నట్లు సిట్ అధికారులు ప్రకటించారు. కిడ్నాప్ కేసులో అరెస్టు చేస్తున్నట్లు అధికారులు తెలిపి అక్కడనుంచి నేరుగా సిట్ కార్యాలయానికి తీసుకొచ్చారు. రాత్రికే మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి కస్టడీకి తీసుకోదలిచారు. కాగా రేవణ్ణపైనా లుక్ అవుట్ నోటీసులు జారీలో ఉన్నాయని ఆయన విదేశాలకు వెళ్తారనే నోటీసులు ఇచ్చినట్లు హోం మంత్రి పరమేశ్వర్ ప్రకటించారు.

పద్మనాభనగర్ అంటే జాతీయ రాజకీయాలకు వేదికగా కొనసాగింది. దాదాపు నాలుగు దశాబ్దాలకాలంలో బెంగళూరుకు వచ్చే అతిరథులతోపాటు రాష్ట్ర, జాతీయ రాజకీయాల మలుపులపై చర్చకు అదే కేంద్రమైంది. ఎందరో ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు పద్మనాభనగర్‌కు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. అటువంటిది తొలిసారి దేవెగౌడ కుమారుడు రేవణ్ణ అరెస్టుతో పద్మనాభనగర్ మరోసారి చర్చకు కారణమైంది.

గతంలోనూ ఇదే పరిస్థితి..

ఒకప్పటి జేడీఎస్ ఎంపీ శివరామేగౌడ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. హాసన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవణ్ణ 30ఏళ్లక్రిందట ఇంగ్లండ్‌లో ఇలాంటి విషయాల్లోనే ఇరుక్కున్నారన్నారు. రేవణ్ణకు ఇదేమి కొత్త కాదని సిట్ అధికారులు ఓసారి ఇంగ్లండ్‌లో విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఓ హోటల్‌నుంచి బయటకు పంపారని ఆరోపించారు.

ప్రజ్వల్ లొంగిపోనున్నారా..?

రాసలీలల వ్యవహారంలో వివిధ దేశాల్లో తిరుగుతూ పరారీలో ఉన్న ప్రజ్వల్ రేవణ్ణ తండ్రి రేవణ్ణ అరెస్టుతో ఎప్పుడైనా లొంగిపోనున్నట్లు తెలుస్తోంది.

కిడ్నాప్ బాధితురాలి గుర్తింపు

బెంగళూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ప్రజ్వల్, ఎమ్మెల్యే రేవణ్ణలపై రాసలీలల ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలిని ఎట్టకేలకు పోలీసులు గుర్తించారు. ఏప్రిల్ 29న బాధితురాలిని కిడ్నాప్ చేయగా కేఆర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇదే కేసులోనే ఎమ్మెల్యే రేవణ్ణ అరెస్టు అయ్యారు. హుణసూరు తాలూకా కాడేనహళ్ళిలోని రేవణ్ణ ఆప్త సహాయకుడు రాజశేఖర్ ఫాంహౌస్‌లో ఆమెను బంధించారు. రేవణ్ణ సూచనలమేరకు సతీశ్‌బాబు ఆమెను కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. సతీశ్‌బాబును శుక్రవారం అరెస్టు చేసిన పోలీసులు కోర్టు ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. ఈ సందర్భంగా ఆరా తీయగా హుణసూరు తాలూకాలోని ఒక ఫాంహౌస్‌లో ఉంచిన సమాచారం మేరకు పోలీసులు శనివారం ఆమెను రక్షించారు.


రేవణ్ణను అదుపులోకి తీసుకుంటున్న అధికారులు

నేటితో మలివిడత ప్రచారానికి..

తెర




● గ్యారెంటీలు మరిచారు ● పెన్‌డ్రైవే ప్రధానాస్త్రం ● మారిన రాజకీయ చిత్రం

బెంగళూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో విడత లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఆదివారంతో తెరపడనుంది. ఇటీవల నెల రోజులుగా ఉత్తరకర్ణాటక జిల్లాల్లో మండే సూరీడు భగభగలతోపాటు రాజకీయ వేడి కొనసాగింది. ఈనెల 7న మంగళవారం పోలింగ్ జరగనుండడంతో ఆదివారం సాయంత్రం 6 గంటలకు బహిరంగ ప్రచారం ముగియనుంది. రెండో విడతలో చిక్కోడి, బెళగావి, బాగల్కోటె, విజయపుర, కలబురగి, రాయచూరు, బీదర్, కొప్పళ, బళ్ళారి, హావేరి, ధారవాడ, ఉత్తరకన్నడ, దావణగెరె, శివమొగ్గ నియోజకవర్గాల్లో 7న పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలోని 28 నియోజకవర్గాల్లో తొలి విడతలో 14 స్థానాలకు ఏప్రిల్ 26న పోలింగ్ జరగగా రెండో విడతలో ఉత్తరకర్ణాటకలోని 14 స్థానాలకు పోలింగ్ జరగనుంది. రెండోవిడతలో హేమాహేమీలు బరిలో ఉన్నారు. మాజీ సీఎంలు బసవరాజ్ బొమ్మై, జగదీశ్ శెట్టర్, మాజీ సీఎం యడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర, మాజీ సీఎం బంగారప్ప కుమార్తె గీతా శివరాజ్‌తోకలిపి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమని బరిలో ఉన్నారు. ప్రస్తుతం మంత్రులుగా వ్యవహరిస్తున్న సతీశ్‌జార్కిహోళి కుమార్తె ప్రియాంక జార్కిహోళి, లక్ష్మీ హెబ్బాళ్కర్ కుమారుడు మృణాల్, శివానంద పాటిల్ కుమార్తె సంయుక్తా పాటిల్, మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున భార్య ప్రభా మల్లికార్జున బరిలో ఉన్నారు. ఎన్నికల్లో ప్రచారానికి అగ్రనేతలు తరలివచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ ఒకే రోజున నాలుగు బహిరంగసభల్లో పాల్గొనగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర నేతలు యడియూరప్ప, మాజీ ప్రధాని దేవేగౌడ, మాజీ సీఎం కుమారస్వామిలు, ఇక కాంగ్రెస్ తరఫున రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లతో పాటు పలువురు ఉన్నారు.

మారిన కాంగ్రెస్ నేతల తీరు

కాగా కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీల ప్రచారాన్ని వీడి పెన్‌డ్రైవ్‌నే ప్రధాన అస్త్రంగా చేసుకున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తీవ్రంగా ఆరోపించారు. చేసిన అభివృద్ధి పనులు ప్రచారం చేసుకోవాలని అలా కాకుండా పెన్‌డ్రైవ్ అంశంతో రాజకీయం చేస్తున్నారన్నారు.





నీతివంతమైన పాలనే ధ్యేయం

● రాహుల్ గాంధీకి అబద్ధాలు తెలియదు
● సమస్యలు తెలుసుకునేందుకే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర
● కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ


కాంగ్రెస్ నేతల అభివాదం

బెంగళూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ నీతివంతమైన సమాజం కోసం పాటు పడతారని, అదే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని కాంగ్రెస్ అగ్రనేత్రి ప్రియాంక గాంధీ అభిప్రాయపడ్డారు. శనివారం ప్రియాంకగాంధీ ఎన్నికల ప్రచారంలో భాగంగా దావణగెరె, హావేరి బహిరంగసభలలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ దేశ సమస్యలు తెలుసుకునేందుకు పాటుపడ్డారన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా పాదయాత్ర చేశారని, మణిపుర్ నుంచి ముంబైదాకా వెళ్లారన్నారు. దేశంలో అన్నివర్గాలకు సమానమైన హక్కులు కావాలని రాహుల్ ఆకాంక్షించారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అబద్ధాలు చెబుతుంటారని తీవ్రస్థాయిలో విమర్శించారు. దేశ వ్యాప్తంగా ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. దావణగెరెలో విద్యావంతురాలు డాక్టర్ ప్రభా మల్లికార్జున్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.


హాజరైన ప్రజలు

అబద్ధాల ప్రధాని : సీఎం

పదేళ్ల పాలనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏం చేశారో ప్రజలకు తెలిపి ఓట్లు అడగడం లేదని కొత్త అబద్ధాలతో ప్రచారం చేస్తున్నారని సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. దావణగెరె ప్రచారసభలో సీఎం మాట్లాడుతూ ఇండిపెండెంట్ అభ్యర్థి వినయ్‌కుమార్‌కు ఓట్లు వేస్తే అది బీజేపీకి అనుకూలం కానుందన్నారు. వినయ్‌కుమార్‌కు టిక్కెట్ ఇస్తామని హామీ ఇవ్వలేదన్నారు. ఆరు నెలలక్రితమే పార్టీలో చేరారన్నారు. కానీ శామనూరు శివశంకరప్ప దశాబ్దాలకాలంగా కాంగ్రెస్‌లో ఉందన్నారు. వినయ్‌కుమార్‌కు తమ మద్దతు లేదని స్పష్టం చేశారు. డీసీఎం డీకే శివకుమార్, శామనూరు శివశంకరప్ప, అభ్యర్థి ప్రభా మల్లికార్జున్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

నల్లజెండాలతో నిరసనకు యత్నం

కాగా గదగ్ జిల్లా అధికారి కార్యాలయం ఎదుట జేడీఎస్ కార్యకర్తలు నల్లకండువాలతో నిరసనలు తెలిపేందుకు ప్రయత్నించగా పోలీసులు తిప్పికొట్టారు. హుబ్బళ్ళిలో రెండురోజులక్రిందట జేడీఎస్ కోర్ కమిటీ వేళ కాంగ్రెస్ నిరసన తెలిపిన మేరకు ధీటుగా జేడీఎస్ కూడా నల్లజెండాలు ప్రదర్శించాలని చూశారు. అయితే పోలీసులు ముందస్తుగా 20మంది కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

కేన్సర్ పట్ల అవగాహనే ముఖ్యం

● కెనరాబ్యాంకు సదస్సులో నిపుణురాలు పల్లవి

బెంగళూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ పట్ల అవగాహన ముఖ్యమని ముందుగా గుర్తుంచుకుంటే భవిష్యత్తు ఉజ్వలమని కిద్వాయ్ మెమోరియల్ ఆసుపత్రి గైనకాలజికల్ అంకాలజిస్ట్ ప్రొఫెసర్ పల్లవి వీఆర్ అభిప్రాయపడ్డారు. కెనరాబ్యాంకు ప్రధాన కార్యాలయంలో శనివారం జనరల్ మేనేజర్ మహేశ్ ఎం పాల్ మార్గదర్శకంలో 'అవేర్‌నెస్ టుడే - క్యూర్ టుమారో' అనే నినాదంతో చైతన్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పల్లవి మాట్లాడుతూ రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ వంటి అంశాలపై వివరించారు. కేన్సర్‌ను నివారించేందుకు ఆరోగ్యకరమైన జీవనశైలి ముఖ్యమన్నారు. అనుమానం ఉంటే ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. తద్వారా వైద్యం సులభతరం కానుందన్నారు. కెనరాబ్యాంకు హెడ్ ఆఫీస్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్‌శంకర్ మజుందార్ మాట్లాడుతూ మహిళలకోసం ప్రత్యేకంగా నోబుల్ సేవింగ్స్ ఖాతా కెనరా ఏంజెల్ గురించి వివరించారు. ఉచిత ఆరోగ్యబీమా ప్రయోజనాన్ని అందిస్తుందని, కేన్సర్ కేర్ రక్షణ, వ్యక్తిగత ప్రమాదబీమా, కాంప్లిమెంటరీ హెల్త్ చెకప్ కోసం రూ.10లక్షల దాకా సాయం పొందవచ్చునన్నారు. కేన్సర్ అంటే భయపడాల్సిన పనిలేదని 'కెనరా ఎంజెల్' పాలసీలు పొందాలని సూచించారు. బెంగళూరు సెంట్రల్ రీజనల్ హెడ్ అనంత్ జోలాన్త్‌తోపాటు 350మంది వివిధ రంగాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ పల్లవి, పాల్గొన్న ప్రముఖులు

జన కేతనం
ఆంధ్రజ్యోతి

బ్యాలెట్ ఓటు కోసం నిరసన

కదిరి: శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో పోస్టల్ బ్యాలెట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల ధోరణికి నిరసనగా ఎన్నికల సిబ్బంది ఆందోళనకు దిగారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 50 మందికిపైగా అధికారులు తాము అంతర్ జిల్లాకు చెందినవారమనీ, శిక్షణాకేంద్రంలోని పోస్టల్ బ్యాలెట్ ఇస్తారని శనివారం వచ్చారు. సాయంత్రం 6 గంటలైనా పోస్టల్ బ్యాలెట్ ఇవ్వలేదు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చామనీ, సాయంత్రం వరకు వేచిచూసినా పోస్టల్ బ్యాలెట్ ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. మహిళా సిబ్బంది రాత్రి ఇళ్లకు ఎలా చేరుకోవాలని మండిపడ్డారు.



అప్ప X ఈశ్వరప్ప



- బీజేపీ కంచుకోట శివమొగ్గలో గెలుపెవరిదో..? ● కుమారుడి గెలుపు కోసం చెమటోడుస్తున్న యడియూరప్ప
- రెబెల్ ఈశ్వరప్పతో ఇరు పార్టీలకూ దెబ్బే ● బరిలో ఇద్దరూ మాజీ సీఎంల వారసులే..

బెంగళూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణభారత్‌లోనే బీజేపీ ప్రభుత్వం ఏర్పడేందుకు కారకులైన యడియూరప్ప సొంత జిల్లా శివమొగ్గ కొన్నేళ్లుగా పార్టీకి కంచుకోటగా ఉంది. అయితే రెబెల్ ఈశ్వరప్ప కారణంగా కుమారుడి గెలుపు కోసం యడియూరప్ప చెమటోడ్చాల్సి వస్తోంది. ఇక్కడ బీజేపీ నుంచి యడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర, కాంగ్రెస్ నుంచి మాజీ సీఎం బంగారప్ప కుమార్తె గీతా బరిలో ఉన్నారు. ఇద్దరికీ రాజకీయాలు బాల్యం నుంచే అలవడ్డాయి. ఇద్దరు అభ్యర్థుల తండ్రులు రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని నేతలు. కాంగ్రెస్, బీజేపీలు వీరికే టిక్కెట్‌లు ఇవ్వాలని నిర్ణయించి ఎన్నికలకు దాదాపు ఐదు నెలలకు ముందుగానే పేర్లు ప్రకటించారు. దీంతో నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేసుకునేందుకు అవకాశం లభించింది.

- సమాజ్‌వాదీ పార్టీ శాంతవేరి గోపాలగౌడ, మాజీ సీఎం ఎస్ బంగారప్ప, బీఎస్ యడియూరప్పలు తమ సిద్ధాంతాలకు అనుగుణంగానే జిల్లాలో రాజకీయాలు కొనసాగిస్తూ వచ్చారు. కొత్తతరం అభ్యర్థులు బరిలో నిలిచారు. రాష్ట్ర రాజకీయాల్లో అగ్రనేతగా బీజేపీకి పెద్దదిక్కుగా పేరొందిన యడియూరప్పతో దాదాపు సమకాలీకుడనే పేరొందిన ఈశ్వరప్ప రెబెల్‌గా మారారు. ఆయన బాల్యం నుంచి ఆర్ఎస్ఎస్ భావాలతో ఎదిగారు. హిందూత్వకోసం ఎంతటికైనా సిద్ధమనేలా వ్యవహరించినవారు. మూడేళ్లక్రితం పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఈశ్వరప్ప వ్యవహరించారు. ఓ కాంట్రాక్టర్ ఆత్మహత్యతో మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఇటీవల శాసనసభ ఎన్నికల్లో అధిష్ఠానం టిక్కెట్ నిరాకరించింది. అయినా పార్టీకి విధేయుడిగానే వ్యవహరించారు. లోక్‌సభ ఎన్నికల్లో కుమారుడు కాంతేశ్‌కు హావేరి టిక్కెట్‌కోసం ప్రయత్నించి విఫలం కావడంతో సొంత జిల్లా శివమొగ్గ స్థానానికి ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. ఈశ్వరప్ప బీసీ కురుబ సామాజికవర్గానికి చెందినవారు కావడంతోపాటు హిందూత్వ అజెండాతో స్వామీజీల మద్దతు కలిగి ఉన్నారు. బీవై రాఘవేంద్ర ఇదే స్థానం నుంచి మూడు సార్లు ఎంపీగా గెలుపొందారు. నాల్గోసారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. కన్నడ సినిమా రంగంలో 'దొడ్డమనె'గా పేరొందిన కన్నడ కంఠీరవుడు రాజ్‌కుమార్ కోడలు, మాజీ సీఎం బంగారప్ప కుమార్తె గీతా శివరాజ్‌కుమార్ కాంగ్రెస్ నుంచి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. 2019లో గీతా తమ్ముడు మధుబంగారప్ప కాంగ్రెస్-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.



రాఘవేంద్ర



గీతా శివరాజ్‌కుమార్

- రాఘవేంద్రకు తండ్రి యడియూరప్పకు ఉన్న చరిష్మాతోపాటు జిల్లా అభివృద్ధిని చూపి ఓటు అడుగుతున్నారు. కొన్నేళ్లకాలంపాటు కలగా ఉన్న విమానాశ్రయాన్ని ఆరంభించడం ఓ మైలురాయిగా ఉంది. ఇక కాంగ్రెస్ అభ్యర్థి గీతా శివరాజ్‌కు తండ్రి బంగారప్ప పేరుతోపాటు, తమ్ముడు, ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప సహకారం, రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీలు కలసి వస్తాయని భావిస్తున్నారు. అయితే ఇద్దరు ప్రధాన అభ్యర్థుల మధ్య ఈశ్వరప్ప రంగంలో ఉండడం భిన్నమైన వాతావరణం నెలకొంది. ఈశ్వరప్ప ఎమ్మెల్యేగా మంత్రిగా మాజీ ఉపముఖ్యమంత్రిగా అనుభవం కల్గినవారు. హిందూత్వ వాదిగా గుర్తింపు పొందారు. చివరి రోజుల్లో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేయడంతో కార్యకర్తలు సమీకరించుకోలేకపోయారు. ముస్లింలతో నేరుగా వ్యతిరేకం కల్గినవారు.
- శివమొగ్గ లోక్‌సభ పరిధిలో 8 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా శివమొగ్గ నగర (బీజేపీ), తీర్థహళ్ళి (బీజేపీ), శికారిపుర (బీజేపీ), బైందూరు (బీజేపీ), భద్రావతి (కాంగ్రెస్), సొరబ (కాంగ్రెస్), సాగర (కాంగ్రెస్), శివమొగ్గ గ్రామీణ (జేడీఎస్) ఎమ్మెల్యేలు ఉన్నారు. ఐదుగురు బీజేపీ ఎమ్మెల్యేలు ఉండడం రాఘవేంద్ర కలసి వస్తోంది. ఇక్కడ భిన్నమైన విధానం. కులాలకు అనుగుణంగా గెలుపు అసాధ్యం. మధు బంగారప్ప గడిచిన రెండు ఎన్నికల్లో ఓటమి చెందారు. మధు బంగారప్ప సామాజికవర్గం ఈడిగ, బీసీలు పూర్తిగా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తారనేది గతంలో రుజువు కాలేదు.



- శివమొగ్గలో 17,29,901మంది ఓటర్లు కాగా 8,77,761మంది మహిళలు 8,52,107 మంది పురుషులు, 33మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రాఘవేంద్ర 7,29,872 ఓట్లు పొందగా జేడీఎస్ అభ్యర్థి మధుబంగారప్ప 5,06,512 ఓట్లు మాత్రమే దక్కించుకున్నారు. 2,23,360 ఓట్ల మెజారిటీతో రాఘవేంద్ర గెలుపొందారు.

ఓటర్లను ఆకర్షించేందుకు పోలింగ్ కేంద్రాలు ముస్తాబు



ఆకట్టుకుంటున్న సాంస్కృతిక చిత్రాలు


బళ్లారి సిటీ, మే 4: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలకు మంగళవారం ఓటింగ్ జరగనున్న నేపథ్యంలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు పోలింగ్ కేంద్రాలను ఓటర్లను ఆకట్టుకునే విధంగా అలంకరించారని స్వీప్ కమిటీ అధ్యక్షులు రాహుల్ శరణప్ప తెలిపారు. ప్రజాస్వామ్య పండుగ ఓటింగ్‌కు కౌంట్ డౌన్ ప్రారంభం కాగా జిల్లాలో సఖి పోలింగ్ బూత్‌లు, స్పెషల్ మైండ్స్ మోడల్ పోలింగ్ బూత్‌లు, యూత్ పోలింగ్ బూత్‌లు, సంప్రదాయ పోలింగ్ బూత్‌లు, థీమ్ బూత్‌లను ప్రత్యేక డిజైన్‌లో అలంకరించారన్నారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్లను ఆకర్షించేందుకు 50 ప్రత్యేక పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారన్నారు. మహిళా ఓటర్లను ప్రోత్సహించేందుకు మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సఖి పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారన్నారు. ఈపోలింగ్ బూత్‌లలో ఎక్కువగా మహిళా అధికారులు , సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తారన్నారన్నారు. ఇదే తరహాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక పోలింగ్ బూత్, యూత్ పోలింగ్ బూత్, థీమ్(స్థానిక చరిత్ర,వారసత్వం, సంస్కృతిని ప్రతిబింబించే) పోలింగ్ బూత్, రెండు సంప్రదాయ పోలింగ్‌బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. వేసవి నేపథ్యంలో ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు నీడతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించామని, జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటర్లను ప్రత్యేకంగా ఆకర్షించేందుకు జిల్లా యంత్రాంగం, జిల్లా స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.



సంప్రదాయ పోలింగ్ బూత్

సరిహద్దులో సమరమే..!

- ఉత్తరకన్నడలో ఆసక్తి రేకెత్తిస్తున్న ఎన్నికలు ● అలక వీడని అనంత్ కుమార హెగ్డే
- విశ్వేశ్వరహెగ్డే కాగేరికి టిక్కెట్‌పై బీజేపీ నేతల ఆగ్రహం ● కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ అంజలి నింబాల్కర్



విశ్వేశ్వర హెగ్డే కాగేరి

బెంగళూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చివరన గోవా, మహారాష్ట్రలకు సరిహద్దున భిన్నమైన వాతావరణం కల్గిన ఉత్తరకన్నడ లోక్‌సభ స్థానంలో సత్తా ఎవరు చాటేరో అనేది ఉత్కంఠగా మారింది. ఉత్తరకన్నడ జిల్లా వ్యాప్తంగా అపారమైన పశ్చిమకనుమలు, మరోవైపు సముద్ర తీరం ఉంది. బీజేపీకి కంచుకోటగా ఉండే ఈ నియోజకవర్గంలో ప్రస్తుత ఎన్నికలు కీలకమయ్యాయి. ఉత్తరకన్నడ జిల్లా హిందూత్వ వాదానికి పేరొందింది. 1989 ఎన్నికల్లో కైగా అణుస్థావరం ఏర్పాటును వ్యతిరేకిస్తూ సాహితీవేత్త శివరాం కారంత్ పోటీ చేశారు. నటుడు అనంతరాజ్ జనతాదళ్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఈ పోటీ జిల్లాలో చారిత్రాత్మకమైనదిగా నిలిచింది. 1991లో హుబ్బళ్ళి ఈద్గా మైదానం వివాదం తర్వాత జరిగిన 1996 ఎన్నికల్లో అనంతకుమార్ హెగ్డే గెలుపు ద్వారా బీజేపీ బలోపేతమైంది. అప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీజేపీల మధ్య పోటీ తీవ్రమనిపించినా బీజేపీకి అనుకూలంగానే సాగింది. 1999లో అనంతకుమార్ హెగ్డే ఓటమి చెందారు. కాంగ్రెస్‌కు చెందిన మార్గరెట్ ఆళ్వా ఎంపీ అయ్యారు. 2004 నుంచి నిరంతరంగా బీజేపీ గెలుపొందుతూ వస్తోంది. హిందూత్వ ప్రసంగాలతో అనంతకుమార్ హెగ్డే ఫైర్‌బ్రాండ్‌గా పేరొందారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేబినెట్‌లో మంత్రిగాను వ్యవహరించారు. నిరంతరంగా అనంతకుమార్ హెగ్డే ఎంపీగా గెలుపొందుతూ వచ్చారు. రెండేళ్లక్రితం అనారోగ్యంగా ఉన్నానని మరోసారి పోటీ చేసేది లేదని బహిరంగ ప్రకటన చేశారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న వేళ మూడు నెలలక్రితం మరోసారి క్రియాశీలకమయ్యారు. బీజేపీకి 400 స్థానాలు సాధ్యమైతే రాజ్యాంగం మారుస్తామని చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో పెనుదుమారం రేపాయి. ప్రస్తుత ఎన్నికల్లో అనంతకుమార్ హెగ్డేకు టిక్కెట్ ఇవ్వలేదు. బీజేపీ నుంచి సుదీర్ఘ అనుభవం కల్గిన 6 సార్లు ఎమ్మెల్యే, మంత్రిగా, శాసనసభ స్పీకర్‌గా వ్యవహరించిన విశ్వేశ్వరహెగ్డే కాగేరికి టిక్కెట్ ఇచ్చారు. సంఘ్ పరివార్ నేపథ్యం కల్గినవారు. ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఆయన ఓటమి చెందారు. అయినా ఎంపీ టిక్కెట్ ఇవ్వడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సుదీర్ఘకాలం ఇక్కడ ఎంపీగా వ్యవహరించిన అనంతకుమార్ హెగ్డే సహకరించకపోవడం కోలుకోలేని దెబ్బగా మారింది. మరో ఎమ్మెల్యే శివరాం హెబ్బార్ సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమై ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఉత్తరకన్నడ స్థానం ఎప్పుడూ బ్రాహ్మణ సామాజికవర్గానికే కేటాయిస్తారని బీసీ వర్గాల్లో అసంతృప్తి ఉంది. ఇక బీజేపీ నుంచి చాలాకాలంగా అనంతకుమార్ హెగ్డే ఎంపీగాను, ఎమ్మెల్యేగా విశ్వేశ్వర హెగ్డే కాగేరి మరో ఎమ్మెల్యే శివరాం హెబ్బార్ కూడా అదే సామాజికవర్గంకావడంతో జిల్లా అంతటా వారిదే ప్రాబల్యమైందనే విమర్శలు ఉన్నాయి.





అంజలి నింబాల్కర్

- ఇక కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ అంజలి నింబాల్కర్ రాజకీయ అనుభవం కల్గినవారు. వృత్తి రీత్యా వైద్యురాలైనా సమాజసేవలోనూ భాగస్వామ్యులయ్యారు. ఆమె భర్త హేమంత్ నిం బాల్కర్ రాష్ట్ర కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారిగా ఉన్నారు. లోక్‌సభ పరిధికి చెందినవారే అయినా ఉత్తరకన్నడ వాసి కాదనే విమర్శలు ఉన్నాయి. ఉత్తరకన్నడ రాజకీయాలకు ఆమె కొత్తవారు. స్థానిక కాంగ్రెస్ వర్గాలు ఆమెకు సహకారం పూర్తిగా అందించడం లేదు. ఇలా లోక్‌సభ బరిలోకి ఇద్దరూ కొత్తగా వచ్చిన వారు. 13మంది అభ్యర్థులు బరిలో ఉన్నా బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యనే పోటీ నెలకొంది.
- ఉత్తరకన్నడ లోక్‌సభ పరిధిలో కార్వార (కాంగ్రెస్), భట్కళ (కాంగ్రెస్), శిరసి (కాంగ్రెస్), హళియాళ (కాంగ్రెస్), కిత్తూరు (కాంగ్రెస్) ఎమ్మెల్యేలు కాగా కుమట (బీజేపీ), యల్లాపుర (బీజేపీ) ఎమ్మెల్యేలు ఉన్నారు. నియోజకవర్గంలో 16,22,857 మంది ఓటర్లు ఉండగా మహిళలు 8,07,242, పురుషులు 8,15,599, ట్రాన్స్‌జెండర్‌లు 16మంది ఉన్నారు. కులాల ప్రకారం మరాఠాలు అత్యధికం కాగా నామదారి, మత్స్యకారులు, ముస్లింలు, హాలక్కి ఒక్కల, బ్రాహ్మణ సముదాయానికి చెందినవారు ఇక్కడ అత్యధికం. రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులకు నాయకుల నుంచి కార్యకర్తల దాకా సహకారం లేకపోవడంతో తర్జనభర్జన పడుతున్నారు.



టీచర్లపై పగ..!

- విద్యార్థుల వివరాల నమోదుకు ఇంటర్నెట్ సమస్య
- పలు పాఠశాలల్లో సాధ్యం కాని వైనం
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం
- అవేవీ పట్టని ప్రభుత్వం.. టీచర్లకు గుడ్డిగా నోటీసులు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

కొత్తచెరువు, మే 4: పాధ్యాయులపై ఏపీ ప్రభుత్వం పగబట్టింది. అడుగడుగునా ప్రతీకారేచ్ఛతో రగిలిపోతోంది. ఏచిన్న పొరబాటు జరిగినా బూతద్దంలో చూపిస్తూ ఉపాధ్యాయులను మానసిక క్షోభకు లోనుచేస్తోంది. పొరబాటు లేకున్నా కూడా వేధింపులకు దిగుతోందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయుడు తిరిగి ఇంటికి వచ్చేలోపు పిల్లల చదువు ఏమో కానీ ప్రభుత్వం పెట్టిన కండీషన్లతో నలిగిపోతున్నాడు. ఉన్నతస్థాయి అధికారి సైతం తనిఖీల పేరుతో నానా యాగీ చేస్తూ ఉపాధ్యాయులను ఇబ్బందుల పాల్జేస్తున్నారు. ప్రస్తుతం యాడైస్ యాప్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయలేదంటూ ఏకంగా జిల్లాలో 523 మంది ఉపాధ్యాయులు, 62 మంది ఎంఈఓలకు నాలుగు రోజుల క్రితం షోకాజ్ నోటీసులు ఇవ్వడం కలకలం రేపుతోంది. మారుమూల పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యంలేక ఉపాధ్యాయులు. విద్యార్థుల వివరాలు నమోదు చేయలేకపోయారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా ఉపాధ్యాయులు తప్పు చేసినట్లు చూపుతూ నోటీసులు జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. తప్పు ప్రభుత్వానిది. శిక్ష తమకా అంటూ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

నోటీసుల వెనుక...

పాఠశాలలో చదివే విద్యార్థుల సమగ్ర వివరాలు యూడైస్ యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఒక్కో విద్యార్థికి సంబంధించి 21 కాలమ్స్ భర్తీ చేయాల్సి ఉంటుంది. అందులోని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే రిపోర్టును పొందుపరచాలి. ఇలా ఒక్కో విద్యార్థికి అరగంటపైగా సమయం పడుతుంది. ప్రతి విద్యార్థి పూర్తి సమాచారం తెలుసుకోవాల్సి ఉంటుంది. ఆ విద్యార్థి ప్రోగ్రెస్ రిపోర్టు ప్రధానోపాధ్యాయుడి పర్సనల్ డేటాలో నమోదు చేయాల్సి ఉంటుంది. విద్యార్థికి సంబంధించి ఆటల పోటీలు, ఆరోగ్యం, నెలలో ఎన్ని రోజులు పాఠశాలకు వచ్చాడు తదితర విషయాలతోపాటు స్కూల్‌లోని సమస్యలు, వాటి స్థితిగతులను కూడా యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. వీటిన్నంటినీ సమగ్రంగా రూపొందించాలంటే ఇంటర్నెట్ సదుపాయం తప్పనిసరి. పిల్లలకు చదువు చెప్పడం మానేసి, రోజూ వారి సమాచారాన్ని సేకరించడానికే సమయమంతా సరిపోతుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ఇంటర్నెట్ సదుపాయం లేక..

యూడైస్ యాప్‌లో విద్యార్థుల వివరాల నమోదుకు ఇంటర్నెట్ తప్పనిసరి. మారుమూల గ్రామాల్లో ఇంటర్నెట్ సమస్య తలెత్తడంతో విద్యార్థుల వివరాలు నమోదు చేయడం ఉపాధ్యాయులకు కష్టంగా మారింది. సమస్యను ముందుగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వారు పెడచెవిన పెట్టారు. విద్యాసంవత్సరం పూర్తి కావడంతో పిల్లల సమగ్ర సమాచారాన్ని ఉన్నతాధికారులు పరిశీలించారు. కొన్ని పాఠశాలల్లో యూడైస్‌లో వివరాలు నమోదు చేయని విషయం తేలింది. ఇంటర్నెట్ సౌకర్యం లేదన్న విషయం కూడా తెలుసుకోకుండా ఉన్నతాధికారి ఇదే అదునుగా భావించి ఉపాధ్యాయులపై చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఎంఈఓలకు ఇటీవల షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలో 523 మంది ఉపాధ్యాయులు, 63 మంది ఎంఈఓలకు నోటీసులు ఇచ్చారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఏ తప్పూ చేయకున్నా. వందలాది మందికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమమని మండిపడుతున్నాయి. సౌకర్యాలు సమకూర్చకపోతే ఎలా పనిచేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి.



జిల్లాకు సరఫరా అయిన రూటర్స్

ఉద్యోగులపై 'రుద్దుడు'

అనంతపురం విద్య: వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఓట్లతో ఆటాడేస్తోంది. గత ఎన్నికల ముందు సీపీఎస్ ఉద్యోగులను నమ్మించింది. అధికారంలోకి వచ్చాక నిలువునా ముంచేసింది. ప్రతిపక్షంలో ఉన్న జగన్ వారంలో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పాడు. తర్వాత 5 ఏళ్లలో ఇచ్చిన మాటను పక్కనబెట్టేశారు. అదలా ఉంచితే సీపీఎస్ రద్దు కోసం ఉద్యమ బాట పట్టిన ఉద్యోగులు, ఉపాధ్యాయులపై కేసులు రుద్దాడు. నిరసన తెలిపిన ఉపాధ్యాయులను, ఉద్యోగులను పోలీసులతో బలవంతంగా అరెస్టు చేయించాడు. అక్కడితో ఆగకుండా కేసులు కూడా పెట్టించి, బెదిరింపులకు పాల్పడ్డాడు. జగన్ ప్రభుత్వంతో సీపీఎస్ ఉద్యోగులకు జరిగిన న్యాయం ఇదీ. జగన్ వైఖరిని ఐదేళ్ల భరించిన సీపీఎస్ ఉద్యోగులు ఈ ఎన్నికల్లో తామేంటో చూపిస్తాం అంటూ మండిపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 45 వేల మంది సీపీఎస్ టీచర్లు, ఉద్యోగులు జగన్ సర్కారుపై మండిపడుతున్నారు.

ఓట్ల కోసం జగన్ దొంగాట...

గత ఎన్నికల ప్రచారంలో జగన్ సీపీఎస్ ఉద్యోగులకు హామీ ఇచ్చాడు. రాష్ట్ర వ్యాప్తంగా తాను చేసిన పాదయాత్రల్లో పాల్గొన్న అనేక చోట్ల వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చాడు. సుమారు 109 సార్లు సీపీఎస్ రద్దు చేస్తానని జగన్ హామీ ఇచ్చినట్లు సీపీఎస్ ఉద్యోగులు చెబుతున్నారు. అయితే అప్పుడు ఓట్ల కోసం రద్దు చేస్తానన్న జగన్ అధికారంలోకి వచ్చాక..సీపీఎస్ ఉద్యోగులను వదిలేశాడు. వాళ్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా నిలువునా తొక్కేయాలని చూశాడు.

అరెస్టులు, కేసుల బహుమానం...

సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటూ సీపీఎస్ ఉద్యోగులు నిరసనలు తెలిపారు. ముఖ్యంగా ప్రతి ఏటా సెప్టెంబరు 1న సీపీఎస్ ఉద్యోగులు నిరసలు తెలిపారు. ముఖ్యంగా 2021,2022 సంవత్స రాల్లో టీచర్లు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపడంతో ఉపాధ్యాయులకు బలవంతంగా నోటీసులు ఇచ్చారు. అక్కడితో ఆగకుండా పోలీసులను పెట్టించి అరెస్టు చేయడంతో పాటు, గురువులపై కేసులు కూడా పెట్టించాడు. జిల్లా వ్యాప్తంగా పలువురు టీచర్లపై కేసులు పెట్టించి, వాళ్లను కట్టడి చేయాలని చూశారు. దీంతో తీవ్ర అసహనంలో ఉద్యోగులున్నారు.

పశువుల దాహార్తి తీరుస్తున్న గ్రామపంచాయతీ


మళ్ళూరమ్మ చెరువుకుంటలో నీరు తాగుతున్న గొర్రెలు

శిడ్లఘట్ట, మే 4: తాలూకాలోని దేవరమళ్ళూరు గ్రామంలో మళ్లూరమ్మ చెరువు నుంచి ఒక కుంటకు బోరుబావుల ద్వారా నీటిని మళ్లించి పశువులకోసం తాగు నీటిని సమకూర్చారు. తద్వారా వెయ్యికిపైగా గొర్రెలు, ఆవులకు ఎంతో అనుకూలం అవుతోంది. ఈసారి వేసవిలో మళ్ళూరమ్మ చెరువు ఎండిపోయింది. దేవరమళ్ళూరు గ్రామం సహా చుట్టుపక్కల గ్రామాల పశువులకు ఈ చెరువునీరు ఆసరాగా ఉండేది. ఇలా 15-20 రోజులుగా గ్రామపంచాయతీ సభ్యులు, సిబ్బంది చొరవ చూపి పశువులకోసం పంచాయతీ బోర్ల ద్వారా చెరువులోని ఒక కుంటకు నీరు మళ్లిస్తున్నారు. దేవరమళ్ళూరు గ్రామంలో సుమారు 1300మంది జనాభా ఉండగా అనేకమంది పశువుల పెంపకం కల్గినవారే. ప్రత్యేకించి గొర్రెలు ఇక్కడ ఎక్కువగా ఉన్నాయి. సమీపంలోని కుత్తాండహళ్ళి, మారప్పనహళ్ళి, వారహుణసేనహళ్ళి, దూగరనాయకనహళ్ళి సహా ఇతర గ్రామాల పశువులకు మళ్ళూరమ్మ చెరువే ఆధారం. దేవరమళ్ళూరు గ్రామంలో బోర్లలో ఆశించినమేర నీరు అందుబాటులో ఉండడంతో ఇక్కడ నీటి ఎద్దడి లేదు. అయితే చెరువు ఎండిపోవడంతో పశువులకు ఇబ్బందిగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పంచాతీయ సభ్యులంతా చేరి తీర్మానించి సమస్యను పరిష్కరించారని గ్రామపంచాయతీ కార్యదర్శి గోపాల్ వెల్లడించారు. మళ్లూరమ్మ చెరువులోని ఒక కుంటకు తాత్కాలికంగా నీరు సమకూర్చడం ద్వారా పశువులకు నీటి సమస్య తీరిందని గొర్రెలకాపరి నారాయణస్వామి, ఆంజనేయులు తదితరులు అభిప్రాయపడ్డారు.

టీడీపీకి మద్దతుగా

వలసకార్మిక సంఘం ప్రచారం


కరపత్రాల పంపిణీలో అభిమానులు

బొమ్మనహళ్ళి, మే 4: ప్రవాసాంధ్రులు నివసిస్తున్న ప్రాంతాలైన బొమ్మనహళ్ళి, హొంగసంద్ర, సిద్దాపుర, డైరీ సర్కిల్ తదితర చోట్ల వలసకార్మిక సంఘం నాయకుడు భాస్కర్, రామమోహన్‌నాయుడు, ఆంజనేయులు, అచ్యుత చౌదరి నాయకత్వంలో టీడీపీ తరఫున కొన్ని రోజులుగా ప్రచారం చేస్తున్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థులను బలపరచాలని కోరారు. ప్రత్యేకించి పెనుగొండ అసెంబ్లీ అభ్యర్థి సవితమ్మను, పార్లమెంటరీ అభ్యర్థి బీకే పార్థసారథిని బలపరచాలని కోరారు. అందరికీ అందుబాటులో ఉన్న అభ్యర్థిని గెలిపించాలన్నారు. ప్రత్యేకించి అనంతపురం, సత్యసాయి జిల్లా వాసులు బెంగళూరులో పలు చోట్ల ఉన్నారని వారు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కరపత్రాల ద్వారా కోరారు. ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ 6 పథకాలు ప్రతి ఒక్కరికి కూడా బడుగు బలహీనవర్గాలు అందరికీ చాలా బాగున్నాయని వివరించారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చంద్రబాబు నాయుడు మళ్లీ సీఎం అయితే యువతకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమన్నారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లాకు చెందిన చెన్నుపాటి లక్ష్మీనారాయణ, జంపుల నాగేంద్రనాయుడు, శ్రీధర్ ప్రతాప్, అశ్వత్థ, రుద్ర, ఆదప్ప తోపాటు జనసేన, బీజేపీ, టీడీపీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మదేవి కరగ ఉత్సవం


గంగమ్మదేవికి విశేషపూజలు, అలంకరణ ఇలా...

మహదేవపుర, మే 4: బావి గంగమ్మదేవి ఆలయ పదో వార్షిక కరగ మహోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం సాయంత్రం అమ్మవారికి విశేషపూజల అనంతరం కరగను ధరించి ఊరేగారు. కేఆర్‌పుర ఓల్డ్ పోలీస్ స్టేషన్ రోడ్డు నుంచి కోటె వెంకటరమణస్వామి దేవాలయం రోడ్డు, బాలప్పరెడ్డి లే అవుట్, కటి వెంకటప్ప లే అవుట్, మునియప్ప లే అవుట్, వాసవి మహల్ రోడ్డు, కుంబార రోడ్డు తదితర రోడ్ల మీదుగా కరగ ఊరేగింపు సాదింది. శనివారం తెల్లవారుజామున కేటీ రాజ్‌కుమార్ ఆఫీస్ రోడ్డు మీదుగా గంగమ్మ దేవాలయానికి చేరింది. కరగను వీక్షించేందుకు అయ్యప్పనగర్, రామమూర్తినగర్, దేవసంద్ర, ఐటీఐ, విజినాపుర తదితర ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. ఉత్సవానికి కేటీ రాజ్‌కుమార్ నేతృత్వం వహించారు. శుక్రవారం ప్రారంభమైన జాతర మంగళవారం వరకు కొనసాగనుండడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలి వస్తుండడంతో సందడి నెలకొంది. చుట్టుపక్కలప్రాంతాల్లో జాతర వాతావరణం నెలకొంది. ఈనెల 7న మంగళవారం ఉదయం 6.30 గంటలకు ప్రత్యేక ఊరేగింపు, మధ్యాహ్నం దీపాల హారతి అనంతరం భక్తా దులకు అన్నసంతర్పణ ఉంటుందని నిర్వా హకులు రాజ్‌కుమార్ వెల్లడించారు.

కోతుల మందతో ప్రజల బెంబేలు


రాజీవ్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ కార్‌పార్కింగ్ వద్ద కోతులు ఇలా...

చింతామణి, మే 4: మండుతున్న ఎండల ప్రభావం, వర్షాలు లేక ఆహారం కొరత కారణంగా సమీపంలోని కొండగుట్టలలో ఉంటున్న కోతులు నీరు, ఆహారం కోసం పట్టణంలోకి వచ్చేశాయి. 20-30 నుంచి మందలుమందలుగా తిరుగాడుతున్నాయి. ఇళ్ల మిద్దెలపై ఆరేసిన బట్టలతో ఆటలాడుకుంటూ చింపేస్తూ నానా గందరగోళం చేస్తున్నాయి. కొన్ని చోట్ల ఇళ్ళ, దుకాణాలలోకి చొరబడి చేతికి అందిన ఆహార పదార్థాలను లాక్కెళ్తున్నాయి. మరికొన్ని చోట్ల పార్కింగ్ చేసిన వాహనాలపై తిరుగాడుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కార్ల వైపర్‌లను నాశనం చేసినట్టు తెలుస్తోంది. మరోవైపు ఎవరైనా ఆహారం తీసుకెళ్తున్నట్టు కోతులు గమనిస్తే లాక్కెళ్లి పోతున్నాయి.

పండ్ల దాతల కొరత

పట్టణంలోని పలు లే అవుట్‌లలో కోతులు ఉన్న స్థలాన్ని గుర్తించి మార్కెట్‌లో లభించే పండ్లను తీసుకెళ్లి వెంకటరవణప్ప అనే వ్యక్తి సమకూర్చేవారు. అయితే 2017లో ఆయన మృతితో ఇలాంటి సేవ చేసేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపలేదు. అలా దాతలు ఎవరైనా ముందుకొచ్చి వాటికి కనీసం ఆహారం సమకూర్చగలిగితే పట్టణ వ్యాప్తంగా పలు లే అవుట్‌లలో కోతుల బెడద తీరనుంది. ఈ దిశగా ఆసక్తిగల స్వచ్ఛంద సంస్థలు తగిన చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

గడ్డివామి దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

విజయపుర, మే 4: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో గిరిజాశంకర్ కల్యాణ మండపం సమీపాన నిల్వ చేసిన గడ్డివాముకు నిప్పంటుకుని అపారనష్టం వాటిల్లింది. శనివారం మధ్యాహ్నం సుమారు 3 గంటలకు చోటు చేసుకున్న ఘటనలో లక్షలాది రూపాయల విలువైన పశుగ్రాసం బూడిదపాలైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఫైరింజన్లతో వచ్చి మంటలను నియంత్రించారు. నష్టపోయిన రైతు మునిరాజు మాట్లాడుతూ సుమారు 10 లోడ్ల రాగి గడ్డి వాముగా వేశామని మంటల్లో కాలిపోయిందని విచారం వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను నియంత్రించినా సాధ్యం కాలేదన్నారు. సుమారు 2 లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లిందన్నారు. కరువు పరిస్థితుల్లో ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాల్సి ఉందన్నారు. హొసరఘట్ట నుంచి శ్రమించి పశుగ్రాసం తెప్పించానని అయితే అగ్నికి ఆహుతైందన్నారు.

అగ్నిమాపకశాఖ అధికారి ముజహర్ హసన్ మాట్లాడుతూ ఇటీవల ఎండలు అధికం కావడంతో అగ్ని ప్రమాదాలు పెరిగాయన్నారు. జనవరి నుంచి ఇంతవరకు దేవనహళ్ళి పరిధిలో 144 ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. కొన్నిసార్లు రోజుకు ఐదారు ప్రమాదాలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి హొన్నేగౌడ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. పురసభ సభ్యుడు నారాయణస్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

తహసీల్దార్ జోక్యంతో మార్గం సుగమం


పొక్లైనర్‌తో రోడ్డు చదును

బాగేపల్లి, మే 4: ప్రభుత్వస్థలంలో ప్రైవేట్ వ్యక్తి మట్టి వేసి రాకపోకలకు అంతరాయం కల్పించారన్న రైతుల ఫిర్యాదుపై తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్ స్పందించారు. తాలూకాలోని యల్లంపల్లి గ్రామ సర్వే 144లో 9 ఎకరాల 13 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. ఈ సర్వేలోని భూమిలో రాకపోకలకు రైతులు బాట వేసుకున్నారు. అయితే ప్రైవేట్ వ్యక్తి తీరుతో సమస్య ఏర్పడగా తహసీల్దార్ స్పందించారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో పొక్లైనర్ సాయంతో భూమిని చదును చేసి రాకపోకలకు వీలు కల్పించారు. అధికారుల కార్యాచరణపై రాష్ట్ర రైతుసంఘం, హసిరుసేన తాలూకా అధ్యక్షుడు గోవిందరెడ్డి, పదాధికారులు ధన్యవాదాలు తెలిపారు. ఫిర్యాదు చేసిన రెండు రోజుల్లోనే సమస్యను పరిష్కరించడంపై హర్షం వ్యక్తం చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శ. శంకరనారాయణ కాలమ్...

కార్ల్‌మార్క్స్ (జయంతి)



కార్ల్ హెన్‌రిచ్ మార్క్స్ 1818 మే 5న జన్మించారు. జర్మన్ దేశానికి చెందిన ఆయన తత్వవేత్త, ఆర్థికవేత్తగా, సామాజికవేత్తగా, రాజకీయనేతగా రాణించినా సోషలిస్టు విప్లవకారుడిగా పేరొందారు. యూరోపియన్ నగరాలన్నింటిలోని విప్లవ సమూహాలన్నీ 1847లో కమ్యూనిస్టు లీగ్‌గా ఏకీకృతం కాగా మార్క్స్, ఎంగెల్స్ ఈ కమ్యూనిస్టు లీగ్‌కు సైద్ధాంతిక సూత్రీకరణలను తయారు చేశారు. అలా చరిత్రలో ఆధునిక సోషలిస్టు సిద్ధాంతం శాస్త్రీయంగా ప్రకటించబడింది. 1883 మార్చి 14న కన్నుమూశారు.

టీఆర్ రాజకుమారి (జయంతి)



తంజావూరు రంగనాయకి రజాయి 1922 మే 5న జన్మించారు. టీఆర్ రాజకుమారిగా పేరొందారు. దక్షిణభారత చలనచిత్ర పరిశ్రమలో 'డ్రీమ్ గర్ల్' అని పిలిపించుకున్న తొలి నటి. ఎల్‌వీ ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో 'వసంతసేన' పాత్రలో జీవించింది. ఈ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో నాటకంగా ప్రదర్శించినప్పుడల్లా ఆ పాత్రను జీ వరలక్ష్మి వేసేది. 'చంద్రలేఖ' సినిమా తమిళ, ఆంధ్రలోనూ రజతోత్సవం జరుపుకొంది. నటిగానే కాక గాయనం, నృత్యంలోనూ రాణించారు. ఆర్‌ఆర్ పిక్చర్స్ సంస్థ ద్వారా కొన్ని సినిమాలు నిర్మించారు. నటించింది తక్కువ చిత్రాలే అయినా తరగని కీర్తిని పొందారు. 1999 సెప్టెంబరు 20న కన్నుమూశారు.

పిఠాపురం నాగేశ్వరరావు(జయంతి)



పిఠాపురం నాగేశ్వరరావు 1930 మే 5న తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జన్మించారు. అసలు పేరు పాతర్లగడ్డ నాగేశ్వరరావు. అయితే ఊరిపేరుతోనే గుర్తింపు పొందారు. తెలుగుసినీ రంగంలో నేపథ్యగాయకుడిగా రాణించడమేకాక ప్రముఖ సినీ సంగీత దర్శకులు. మాధవపెద్ది సత్యం - పిఠాపురం నాగేశ్వరరావులను జంట గాయకులుగా పేరొందారు. అవేకళ్ళు, కులగోత్రాలు సినిమాలలోని హుషారైన పాటలు ఎంతో గుర్తింపు పొంది నేటికీ ఆదరణ పొందుతున్నాయి. తెలుగులోనేకాక తమిళ, కన్నడ, హిందీ, సింహళ భాషలలో సుమారు 7వేల పాటలు పాడారు. 1996 మార్చి 5న కన్నుమూశారు.

నౌషాద్‌అలి (వర్ధంతి)



'పద్మభూషణ్' నౌషాద్ అలి 1919 డిసెంబరు 25న లఖ్‌నవ్‌లో జన్మించారు. హిందీ సినీరంగంలో పేరొందిన సంగీత దర్శకులు. క్లాజికల్ మ్యూజిక్‌తో రూపొందిన సినిమాలు 35 సిల్వర్ జుబ్లీలు, 12 గోల్డెన్ జుబ్లీలు, 3 డైమండ్ జుబ్లీలు అందుకున్నాయి. 'మదర్ ఇండియా' సినిమా తొలిసారి ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. సంగీత నాటక అకాడమీ, ఉత్తమ సంగీతదర్శకుడు తదితర పురస్కారాలు పొందారు. 2006 మే 5న కన్నుమూశారు.

రమాప్రభ (పుట్టినరోజు)



రమాప్రభ 1947 మే 5న జన్మించారు. తెలుగు సినీ రంగంలో ఎంతో పేరొందారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణించారు. ఆరు దశాబ్దాలలో 1400కుపైగా సినిమాలలో దాదాపు అన్ని తరం నటులతో నటించారు. 1970-80ల మధ్యన రాజబాబు, రమాప్రభల కమెడియన్ ద్వయం ఎంతో రాణించింది. ప్రముఖ నటుడు శరత్‌బాబును పెళ్లాడి 14ఏళ్ల అనంతరం విడాకులు ఇచ్చారు. సినిమాలలోకి రాకమునుపు నాటకరంగంలో 4వేలకుపైగా రంగస్థల ప్రదర్శనలు ఇచ్చారు.

కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం

రొద్దం, మే 4 : కాంగ్రెస్ పార్టీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నరసింహులు, హిందూపురం ఎంపీ అభ్యర్థి సమద్‌షాహీన్‌కు మద్దతుగా పీసీసీ ఉపాధ్యక్షుడు కేటీ శ్రీధర్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని బొక్సంపల్లి, ఎల్‌జీబీ నగర్, తురకలాపట్నం, పాతర్లపల్లి, పెద్దకోడిపల్లి, రొద్దం గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి నరసింహులుతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పెనుకొండ మండల కన్వీనర్ ప్రకాశ్‌రెడ్డి, నాయకులు గోవిందప్ప, వెంకటరామిరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్స్‌లో రాణించాలంటే పట్టుదల ముఖ్యం

బెంగళూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రూప్స్‌లో రాణించాలంటే పట్టుదల ముఖ్యమని ఇటీవల విడుదలైన ఫలితాలలో 11వర్యాంకు సాధించి కుష్ మెత్వాని అభిప్రాయపడ్డారు. విజన్ ఐఏఎస్ కేంద్రంలో విద్యార్థులచే కుష్ చర్చాగోష్టి జరిపారు. తాను గణితాన్ని ఆప్షనల్‌గా ఎంచుకున్నా అన్నారు. ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో పాఠశాల విద్య పూర్తి చేశానన్నారు. బిటెక్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేసి ఐఐటీ ముంబైలో కమ్యూనికేషన్ సిగ్నల్ ప్రాసెసింగ్‌లో ఎంటెక్ చేశానన్నారు. ఆచరణాత్మక అధ్యయనం చేయాలన్నారు. గ్రూప్స్‌లో ర్యాంకుల కోసం పోటీ పడాలంటే కొన్ని నెలలపాటు కఠోరదీక్ష పాటించాల్సిందే అన్నారు. పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు.

తాటిముంజలకు డిమాండ్


తాటికాయల విక్రయాలు

శిడ్లఘట్ట, మే 4: వేసవి ఎండలు మండిపోతుండడంతో నీరు ఎంతగా తాగినా దాహం తీరడం లేదు. కొన్ని రోజులుగా 39-40 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో మధ్యాహ్నం వేళ ప్రజలు సంచరించేందుకు జంకుతున్నారు. మజ్జిగ, కొబ్బరిబోండాం, ఇతర శీతల పానీయాలను ప్రజలు ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో మామిడికాయలతోపాటు కర్బూజా, దోసకాయలు కూడా అందుబాటులోకి వచ్చాయి. నాలుగైదు రోజులుగా తాటి ముంజలు కూడా మార్కెట్‌లో విక్రయాలు సాగుతున్నాయి. సీజన్‌లో మాత్రమే లభించ తాటిముంజలకు డిమాండ్ ఏర్పడిందని కార్మిక నాయకుడు వెంకటేశ్ అభిప్రాయపడ్డారు. మండుతున్న ఎండలనుంచి కాపాడుకునేందుకు ప్రజలు తమ ఆరోగ్య పట్ల కనీస జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

వృద్ధురాలి మృతి


మాదమ్మ (ఫైల్)

బెంగళూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా సుత్తూరు గ్రామంలో శుక్రవారం పశువుల మేతకోసం వెళ్లిన వృద్ధురాలు మృత్యువాత పడింది. పశువులకు మేత తీసుకుని వస్తుండగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ఒక్కసారిగా కుప్పకూలింది. ఘటనా స్థలంలోనే మాదమ్మ (66) మృత్యువాత చెందింది. ఆమె అకస్మిక మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. కొన్ని చోట్ల పిడుగుపాటుకు పశువులు మృతి చెందాయి.

పేకాటరాయుళ్ల అరెస్టు

విడపనకల్లు, మే 4: మండలంలోని హావళిగి గ్రామంలో మూడు రోజల క్రితం పేకాట స్థావరంపై పాల్తూరు పోలీసులు దాడులు చేసి వైసీపీకి చెందిన పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి నుంచి రూ. 10వేలు స్వాదీనం చేసుకున్నారు. ఎన్నికలు సమయం కావటంతో తమకు ఓటు బ్యాంక్ పోతుందని, అదే గ్రామానికి చెందిన ఓ వైసీపీ నేత పాల్తూరు పోలీసులకు ఫోన్ చేసి వారిని వదిలేయాలని ఆదేశించటంతో వారిపై ఎటు వంటి కేసు నమోదు చేయకుండా వదిలేశారు. వారి వద్ద నుంచి స్వాదీనం చేసుకున్న నగదును, సెల్‌ఫోన్లను వెనక్కి ఇచ్చి పంపినట్లు తెలిసింది. పేకాట రాయుళ్లను వదిలేయటంతో పలువురు టీడీపీ నాయకులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, మే 4: పట్టణ సమీపంలోని పుట్లూరు రోడ్డు రైల్వేట్రాక్‌పై శనివారం షాహీద్‌బాషా (20) అనే యువకుడు రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. పట్టణంలోని శ్రీనివాసపురానికి చెందిన రఫీ, రషీదా దంపతుల కుమారుడు షాహీద్‌బాషాకు కొంతకాలంగా మతిస్థిమితం లేక బాధపడుతుండేవాడు. పలుచోట్ల వైద్యం చేయించినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తిచెంది రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.

గుత్తిలో వ్యక్తి...

గుత్తి, మే 4: పట్టణంలోని ఎంఎస్ జూనియర్ కళాశాల సమీపంలో రైలు కింద పడి శనివారం జనార్ధన్(45) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన జనార్ధన్ గ్రామం వదిలి కొంత కాలంగా గుత్తి ఆర్‌ఎస్ సుందరయ్య కాలనీలో జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక, మానసిక, కుటుంబ సమస్యలతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపారు.

నాటుసారా ఊట ధ్వంసం

బెళుగుప్ప, మే 4: బెళుగుప్ప గ్రామ శివార్లలో శనివారం నాటుసారా తయారీ స్థావరాలపై సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి 300 లీటర్ల ఊట ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు.

వలస ఓటర్లపై గురి

- రప్పించేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- పొరుగు రాష్ట్రాలకు వెళ్లిన నాయకులు
- పోలింగ్ రోజున వాహనాలు, భోజనాలు సైతం
- బంధువుల ద్వారా వివరాల సేకరణ

హిందూపురం, మే 4 : రాష్ట్రంలో జరగబోయే ఎన్నికలు ప్రధాన పార్టీలకు కీలకం. దీంతో ప్రతి ఓటు అభ్యర్థికి అవసరం కావడంతో ఏ ఒక్క ఓటరును వదులుకోకుండా వారిపై అభ్యర్థులు గురిపెట్టారు. ఈ క్రమంలో ఎన్నికల పోలింగ్ సమయం దగ్గరపడుతుంటే రాజకీయ నేతలతో పాటు జనాల్లో ఉత్కంఠ పెరిగింది. అందుకే వలస ఓటర్లపై ప్రధాన పార్టీలు దృష్టిపెట్టాయి. వారిని ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తు న్నారు. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల నుంచి సుమారు 50వేల మందిదాకా వలస పోయారు. వారంతా కర్నాటక, తెలంగాణ, మహారాష్ట్రల కు జీవనోపాధికి వెళ్లారు. వారిని పోలింగ్ రోజున తీసుకొచ్చేందుకు అభ్యర్థు లు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆ బాధ్యతలను ద్వితీయ శ్రేణి నాయకులకు అప్పగించారు. వారు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ఓ వైపు ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం హోరాహోరీగా సాగుతుండగా బయటి ప్రాంత ఓటర్లును ఎలా రప్పించాలి అనేదానిపై దృష్టి పెట్టారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

పోలింగ్ రోజున వలస ఓటర్లను రప్పించేందుకు అభ్యర్థులు ఫోకస్ పెంచారు. అభ్యర్థుల వద్ద నమ్మకంగా ఉన్న ద్వితీయశ్రేణి నాయకులకు వల స ఓటర్లను రప్పించే బాధ్యతలు అప్పగించారు. వారు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి వలస ఓటర్ల వద్దకు పంపుతున్నారు. అదికూడా సామాజిక వర్గాల వారీగా బృందాలు ఏర్పాటుచేసి ఆయా సామాజిక వర్గ ఓటర్లను కలిసేందుకు వ్యూహరచన చేశారు. ఇప్పటికే ఓ రౌండ్ వెళ్లివచ్చారు. అయితే ఒక పార్టీ నాయకులు రెండు రోజులుగా వలస ఓటర్లపై దృష్టిపెట్టారు. వా రికి సంబంధించిన నాయకులు కర్ణాటకలోని బెంగళూరు, చిక్కబళ్లాపురం, కోలార్, తుమ కూరు, మైసూరు, బళ్లారి, తెలంగాణ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రకు వెళ్లారు. అక్కడికి వెళ్లి వారికి ఒక్కసారి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించి, నమూనా బ్యాలెట్ పత్రాలు అందజేస్తున్నారు. ఇంకొం దరి వివరాలు, ఫోన్‌నంబర్లు ఆరాతీస్తున్నారు. ఇదిలా ఉంటే ఈనెల 13న జరిగే పోలింగ్‌కు వలస ఓటర్లను రప్పించే బాధ్యతను ప్రత్యేకంగా తీసుకోగా ఆ రోజు వారు వచ్చేం దుకు వాహనాల ఏర్పాటు, వారి కి భోజనాలు, తదితర సదుపా యాలపై ఇప్పటికే కొంతమందికి ఆ పనులు అప్పజెప్పారు. పోలింగ్ సోమవారం జరుగనుండటంతో శనివారం సాయంత్రాని కే వలస ఓటర్లు స్వగ్రామాలకు వచ్చేందుకు వాహనాలు ఏర్పా టు చేశారు. పది మంది లోగా ఉంటే కారు, 30మంది లోపు ఉంటే మినీబస్సు, అంతకంటే ఎక్కువ ఉంటే బస్సులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వారు పోలింగ్ రోజున వస్తే భోజనాలు, ఇతర వసతులను స్థానికంగా సిద్ధం చేస్తున్నారు.




బంధువుల ద్వారా వివరాల సేకరణ

ఇదిలా ఉంటే వలస ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారనే దానిపై బూత్ ఇన్‌చార్జ్‌లు దృష్టిసారించారు. వలస ఓటర్లను గుర్తించి వారి బంధువుల వద్దకు వెళ్లి ఎక్కడ జీవనోపాధికి వెళ్లారో తెలుసుకుంటున్నారు. వారి ఫోన్ నంబర్లు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. అధికార పార్టీలో ఓ ప్రత్యేక టీమ్ ఇందుకోసం ప్రత్యేక ప్రయత్నాలు చేస్తోంది. వారు ఎక్కడున్నారు పోలింగ్‌కు వచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నారా లేదా అనేదాన్ని బంధువుల ద్వారా ఆరాతీస్తున్నారు.

వలస ఓటర్ల చూపు ఎటువైపు?

సొంతూళ్లలో భూములు, పనులు లేనివారు గతంలో అధికంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. కానీ ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకాలు, అఘాయిత్యాలు, భూదందాలు అధికం కావడంతో చాలా మంది చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు లేకపోవడం వల్ల చేతినిండా పని దొరకక వలస వెళ్లినవారే చాలామంది ఉన్నారు. అదేవిధంగా అధికార పార్టీ నాయ కుల బెదిరింపులు తాళలేక భయభ్రాంతులకు గురై పక్కరాష్ట్రాలకు వెళ్లిన వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో అధికార పార్టీకి వ్యతి రేకంగా ఓటువేసే వలస ఓటర్లు అధికంగా ఉన్నట్లు ఇటీవల ఓ సర్వేసంస్థ పేర్కొంది. దీంతో ఎలాగైనా వలస ఓటర్లను రాకుండా చేయాలని వైసీపీ కు యుక్తులు పన్నుతోంది. వారి బంధువుల ఇళ్లవద్దకు వెళ్లి ఓటుకు కావాలంటే డబ్బు ఇస్తాంకానీ వారిని ఇక్కడికి ఓటింగ్‌కు రాకుండా చూడాలంటూ చెబుతుండడం విశేషం. దీనినిబట్టి వలస ఓటర్లు అంటే అధికార వైసీపీ వారికి ఎంత భయం ఉందో ఇట్టే అర్థం అవుతుంది. ఈ పరిస్థితుల్లో ఓటును కీలకంగా భావించి వలస ఓటర్లపై గురిపెట్టారు.

ప్రచార పర్వం




తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.36	1,576.13
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	169	258
సామర్థ్యం (టీఎంసీలు)	3.73	2.87

నేటితో మలివిడత ప్రచారానికి తెర

- నెలరోజుల నుంచి హోరాహోరీ ప్రచారం
- ప్రచారంలో పీఎం నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నాయకులు రాహుల్, సీఎం సిద్దరామయ్య



ప్రచారంచేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీరాములు

బళ్లారి, మే 4(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఆదివారం సాయంత్రంతో తెరపడ నుంది. ప్రధాన రాజకీయ పార్టీలు అయిన బీజేపీ, కాంగ్రెస్‌లతో పాటు పోటీలో ఉండే ఇతర పార్టీల అభ్యర్థులు నెలరోజులుగా ఎడతెరపి లేకుండా ప్రచారం సాగించారు. బీజేపీ నుండి దేశ ప్రధాని నరేంద్రమోదీ, మాజీ ముఖ్యమంత్రులు యడ్యూరప్ప, బసవరాజ్‌బొమ్మై, అమిత్ షా, ఇతర కేంద్ర మంత్రులు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, గాలి లక్ష్మిఅరుణ, పాలన్న, శ్రీనివాస్ మోత్కర్, క్రిష్టారెడ్డి, తదితర బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. కాంగ్రెస్ నుండి ముఖ్యనాయకులు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, మంత్రులు నాగేంద్ర, రామలింగారెడ్డి, వీరితో పాటు ఎమ్మెల్యేలు నారా భరత్‌రెడ్డి, గణేష్, శ్రీనివాసులు, హెచ్.ఆర్.జీ గవియప్ప, డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, మాజీ ఎమ్మెల్సీ అల్లం వీరభద్రప్ప లాంటి ముఖ్యనాయకులు తెర ముందు ప్రచారం చేస్తే తెరవెనుక నారా సూర్యనారాయణరెడ్డి, ఇతర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పనిచేశారు. ప్రచారంలో బీజేపీ ముందు నుండి ప్రచారం సాగించింది. కానీ కాంగ్రెస్‌లో ఎంపీ అభ్యర్థి ఎవరా అనేది ఆలస్యంగా ప్రకటించడంతో కాంగ్రెస్ పచారం కొంత ఆలస్యంగా జరిగింది.



కాంగ్రెస్ అభ్యర్థి కోసం ఓట్లు అడుగుతున్న మంత్రి నాగేంద్ర

బీజేపీ అభ్యర్థి బి. శ్రీరాములు తన ప్రచారంలో తనకు రాజకీయ భిక్ష పెట్టాలని, తనను ఈ ఎంపీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. అలాగే గతంలో చేసిన తప్పులు చేయనని, అందరితో కలిసి పనిచేస్తానని ఓటర్లకు అభ్యర్థించారు. అలాగే దేశ ప్రధాని మోదీ లాంటి విజన్ ఉండే నాయకుడు అత్యవసరం అని ప్రచారం చేశారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి ఈ తుకారాం ప్రస్తుతం సండూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన అయితేనే శ్రీరాములుకు గట్టి పోటీ ఇస్తారు అనే కారణంతో పోటీలో నిలిపారు. తుకారాంకు బ్యాక్ బోన్ అంతా సండూరు రాజు సంతోష్ లాడ్. ఆయన కనుసన్నల్లోనే అంతా నడుస్తుంది. ఇక తుకారాం ప్రచారంలో ముఖ్యంగా కాంగ్రెస్ ఐదు గ్యారెంటీలే అస్త్రంగా వాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉందని, మీకు మరింత సౌలభ్యం కావాలంటే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యేలు కూడా తుకారాం గెలుపుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు, మంత్రి అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. కానీ ఎమ్మెల్యేలు వారి వారి సొంత నియోజకవర్గాల్లో ఉంటూ ప్రచారం చేశారు. మండుటెండల్లో అభ్యర్థులు, అలాగే పార్టీల నాయకులు ఎడతెరపి లేకుండా ప్రచారం చేశారు. ఇంత కాలం సౌండ్‌మైకులు, ఆటోరిక్షాలతో అన్ని వీధులూ హోరెత్తాయి. ఇక నేటితో బహిరంగ ప్రచారానికి తెరపడనుంది.

మహిళాశక్తి బీజేపీకి వ్యతిరేకం



మాట్లాడుతున్న కేపీసీసీ మహిళా అధ్యక్షురాలు పుష్ప

బళ్లారి సిటీ, మే 4: దేశంలో ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు బీజేపీకి వ్యతిరేకంగా మారారని రాష్ట్ర కేపీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు పుష్పా అమర్‌నాథ్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా ఓటు వేస్తారని, దేశ పాలకుల భవితవ్యం వారు తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్యుల దైనందిన జీవనం అగమ్యగోచరంగా మారిందని, దీంతో బీజేపీ తప్పుడు ఆశలతో విసిగిపోయిన మహిళలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని నిర్ణయించుకున్నారన్నారు. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో మోదీ హవా నెలకొందని, ఆయన అభ్యర్థులు విజయం సాధించారని, కానీ పదేళ్లలో ఆయన ప్రజల సమస్యలను పరిష్కరించలేదన్నారు. బీజేపీ పాలన వల్ల పది లక్షల మంది మహిళలు ఉపాధి కోల్పోయారని ఆరోపించారు. నేహా హత్యకేసులో న్యాయం జరగకపోతే వీధుల్లో పోరాటానికి సిద్దమన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు మంజుల,లక్ష్మి, జ్యోతి, మల్లమ్మ, శోభకాళింగ,అసినా,యోగిని తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా

కంప్లి, మే 4 : సండూరు తాలుకాలోని కుమారస్వామి ఆలయం కింద రోడ్డు మార్గంలో శనివారం ఉదయం అదుపుతప్పి మైన్స్ లారీ బోల్తాపడింది. డ్రైవర్‌కు, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వబోయి పక్కనే వున్న కొండను ఢీకొన్నారు. ఇందులో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదని, డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయని దీనిపై సండూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది.

కుడితినిలో పోలీసుల కవాతు



కుడితిని పట్టణంలో కవాతు చేపడుతున్న పోలీసులు

కంప్లి, మే 4 : ఈ నెల 7వ తేదీన జరిగే ఎన్నికల్లో ధైర్యంగా తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకోవాలని డీఎస్పీ ప్రసాద్ గోపీ తెలిపారు. శుక్రవారం కుడితిని పోలీస్ స్టేషన్ పరిధిలో దరోజీ, మాదాపురం, తిమ్మలాపురం, కుడితిని తదితర ప్రాంతాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లోబడకుండా, ఎవరికీ భయపడకుండా ధైర్యంగా తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు. చుట్టుపక్కల పరిధిలో ఎలాంటి ఒత్తిళ్లు ఏవైనా వుంటే పోలీస్ స్టేషన్‌లకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ విశ్వనాథ్ హిరేగౌడ, ఎస్ఐ ఉలిగేష్, పారామిలిటరీ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

జ్యువెలర్స్‌లో పేలుడుపై కేసు నమోదు

బళ్లారి గాంధీనగర్, మే 4: ఈ నెల 2వ తేదీ తేరు వీధిలోని కళ్యాణ్ జువలరీ షోరూమ్‌లో ఏయిర్ కండీషనర్ పేలిన ఘటనకు సంబంధించి బ్రూస్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో తబ్రేజ్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బ్రూస్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వడ్డర బండ సమీపంలో వెదర్ రిఫ్రిజిరేటర్ షాపులో పనిచేస్తున్న మహ్మద్ తబ్రేజ్ వెదర్ రెఫ్రిజేటర్ షాప్‌లో టెక్నిషియన్‌గా పనిచేస్తున్నాడు. కళ్యాణ్ జువలరీ వ్యవస్థాపకులు సతీష్ కుమార్ ఏసీ పనిచేయడం లేదని బెంగళూరులోని బ్లూస్టార్ కంపెనీకి ఫిర్యాదు చేయడంతో బ్లూస్టార్ కంపెనీ వారు వెదర్ రిఫ్రిజిరేటర్ యజమాని మెహ్మద్ అవేజ్‌కు సర్వీస్ ఆర్డర్ చేశారు. దీంతో వెదర్ రిఫ్రిజిరేటర్ షాప్‌లో పనిచేస్తున్న తబ్రేజ్, అహ్మద్ బాషా, సైయ్యద్ జుబారాలు ముగ్గురు గురువారం సాయంత్రం కళ్యాణ్ జువలరీ షాప్‌లో ఏసి రిపేరి చేస్తుండగా ఏసీ పేలిందని, రిపేరికి వెళ్ళిన సమయంలో ముగ్గురు టెక్నీషియన్లు, షాపులో పనిచేస్తున్న ఒకరు మొత్తం నలుగురు గాయపడ్డారని తబ్రేజ్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మహిళా బీజేపీ కార్యకర్తల ఇంటింటి ప్రచారం



సిరుగుప్ప, మే 4 : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో 18వ వార్డులో బీజేపీ మహిళా కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ బీజేపీ కమలం గుర్తుకు ఓటు వేసి బసవరాజును ఎంపీ అభ్యర్థిగా గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షురాలు మహాలక్ష్మీ, పద్మావతి, సుగుణమ్మ, మహిళలు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే ఎజెండా బీజేపీది

బళ్లారి సిటీ, మే 4: బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించిన దేశ రాజ్యాంగాన్ని మారుస్తామనే సందేశం బీజేపీలో దాగి ఉందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దళిత సంఘాల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ కలివీర అన్నారు. నగరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అగ్రవర్ణాలకు రక్షణ కల్పించేందుకు రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ ఆలోచిస్తోందన్నారు. అందుకే నాలుగు వందల నియోజక వర్గాల్లో గెలుపే లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలో పంచ గ్యారెంటీ పథకాలను అమలు చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే దేశ సర్వతోముఖాభివృద్ధికి, ప్రజల కష్టాలను తీర్చేందుకు 25హామీలను పంచ న్యాయాల ద్వారా అమలు చేయాలని సంకల్పించిందన్నారు. ప్రజలు,మహిళల ఆర్థిక సాధికారత కోసం రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. కావున కాంగ్రెస్‌కు ఓటు వేసి ఇక్కడి అభ్యర్థి తుకారంను గెలిపిద్దామన్నారు. విలేకరుల సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాజగోపాల్ ,గోవిందరాజులు,గురుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి గోపాల్, కృష్ణప్ప, గోవర్దన్ తదితరులున్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా వెల్లడి

బళ్లారి సిటీ,మే 4: పోలింగ్ కోసం ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్టు రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. బళ్లారి జిల్లాలో 5952 మంది అధికారులను, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. నగర కలెక్టర్ కార్యాలయంలోని కేస్వాన్ హాల్లో శనివారం ఎన్నికలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 7 వ తేది ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు ఓటింగ్ జరుగుతుందని, ఆదివారం సాయంత్రం బహిరంగ ప్రచారం ముగిస్తుందన్నారు. అభ్యర్థులు డోర్ టూ డోర్ సందర్శనల ద్వారా కాన్వాస్ చేయవచ్చునన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం నియోజకవర్గంలోని ఓటర్లు కాని వారు నియోజకవర్గాన్ని విడిచి వెళ్లాలని సూచించారు. పోలింగ్ రోజు ప్రభుత్వ సెలవుదినం కనుక మే 8వతేది వరకు జిల్లాలో మద్యం అమ్మకాలు నిషేధించామన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థుల సమక్షంలోనే ర్యాండమైజేషన్ జరిగిందని, అన్ని ప్రక్రియలను వారి దృష్టికి తీసుకెళ్లామని డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా స్పష్టం చేశారు. ఈసారి ఎండల తీవ్రత పెరిగినందున ఓటర్లందరూ వీలైనంత త్వరగా ఉదయం నుంచే పోలింగ్ బూత్‌లకు తరలిరావాలని కోరారు. పోలింగ్ సందర్భంగా అవకతవకలు జరగకుండా 24చెక్ పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. పోలింగ్ సందర్భంగా అవాంచనీయ సంఘటనలు సృష్టించిన 11 కేసుల్లో 9మంది రౌడీలను బహిష్కరించామన్నారు. ఇప్పటి వరకు రూ, 8.41 కోట్ల నగదు పట్టుబడిందన్నారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా. జిల్లారిటర్నింగ్ అధికారుల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తదితరులు

జోరుగా కాంగ్రెస్ ప్రచారం



కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం

కంప్లి, మే 4 : కంప్లి పట్టణంలోని షుగర్ ఫ్యాక్టరీ 21వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ఈ తుకారామ్ గెలుపు కోసం కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. శనివారం రవి చంద్ర (రవిశేఖర్) నేతృత్వంలో షుగర్ ఫ్యాక్టరీలో జోరుగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ గెలుపు ఖాయమని జిల్లాలో పూర్తిగా అభివృద్ధి బాటలో కొనసాగడం ఖచ్చితమన్నారు. సండూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గా వున్న సమయంలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందా రని, ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలే ఆయనకు గెలుపునిచ్చాయన్నారు. అలాగే బళ్లారి, విజయనగర జిల్లాల్లో కూడా ఆయన పనితనం, అభివృద్ధి దృష్టిలో వుంచుకుని భారీ మెజార్టీతో తుకారామ్ గెలుపొందడం ఖాయమన్నారు. ఆయనతో పాటు రంగస్వామి, నాగరాజు, చిట్టి, తాయన్న, రవి, గౌస్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపుతోనే దేశాభివృద్ధి: భోవిసమాజ ప్రముఖులు



మాట్లాడుతున్న బీజేపీ కార్యదర్శి వినయ్ బిదిరి

సిరుగుప్ప, మే 4 : కొప్పళ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి డాక్టర్ బసవరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ కార్యదర్శి వినయ్ బిదిరి తెలిపారు. సిరుగుప్ప పట్టణం బీజేపీ కార్యాలయంలో శనివారం భోవి సమాజం సభ్యుల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో భోవి సమాజానికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది బీజేపీ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి ప్రధాని అయితే దేశం అభివృద్ధికి మారుపేరవుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చ తాలుకా అధ్యక్షులు మారేష, జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ ఉలిగప్ప, జిల్లా మండల అధ్యక్షులు మల్లికార్జున స్వామి, నగరసభ కౌన్సిలర్లు నటరాజు, రామకృష్ణ, తాలుకా పంచాయతీ సభ్యులు రామరాజు, అమరేష, వినయ్ జైన్, నగరసభ బీజేపీ అధ్యక్షులు విక్రమ్ కుమార్ జైన్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపరుల షెల్టర్ బీజేపీ..!

కర్ణాటక రాష్ట్ర మంత్రి రామలింగారెడ్డి

రాయచూరు, మే 4 : తనను తాను మిస్టర్ క్లీన్‌గా చెప్పుకునే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ అవినీతి పరులకు షెల్టర్‌గా మారిందని రాష్ట్ర మంత్రి రామలింగ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జిల్లాలోని సింధనూరు నగరానికొచ్చిన మంత్రి స్థానిక ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడతో కలిసి విలేఖరులతో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీల్లో ఉన్న నాయకుల పై ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థలతో దాడులు చేయించడం అవినీతిపరులుగా ముద్రవేయడం వారిని పార్టీలోకి చేర్చుకోవడమే మోదీ విధానమన్నారు. అవినీతి పరుల సొమ్మును పార్టీలోకి జమా చేసుకోవడం వాషింగ్ మెషిన్ లో వేసి వారిని పరిశుద్ధులుగా ప్రపంచానికి చాటడమే ఆయన చేస్తున్న పని అని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉన్న వారందరిని అవినీతిపరులుగా చిత్రిస్తున్న నరేంద్ర మోదీ వారందరిని తిరిగి బీజేపీలోకి చేర్చుకోవడం ద్వార సమాజానికి ఏరకమైన సందేశం ఇస్తున్నారని మంత్రి రామలింగారెడ్డి ప్రశ్నించారు.

తమ పార్టీలో చేరిన అవినీతిపరుల పై గతంలో ఉన్న కేసులను ఎత్తివేసే పనులో ప్రధాని నిమగ్నమై ఉన్నారని ఆరోపించారు. కాగా ఈ సారి ప్రధానిగా తిరిగి నరేంద్ర మోదీ అధికారంలోకొస్తే ఇవి చివరి ఎన్నికలని భవిషత్తులో ఎన్నికలనేవి ఉండవని అన్నారు. అవి ప్రజాస్వామ్యానికి ప్రమాదం అని సాక్షత్తు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భర్త పరకర ప్రభాకర్ చెప్పిన వినయాన్ని రామలింగారెడ్డి గుర్తు చేశారు. కాగా నరేంద్ర మోదీ వయస్సు మళ్లిన సినిమా హీరో లాంటివాడని సినిమాలో అలాంటివారికి విగ్గులు పెట్టి మేకప్ చేసి ప్రేక్షకులను రంజింపచేసే ప్రయత్నం నిర్మాతలు చేస్తారని అదే ప్రయత్నాన్ని నరేంద్ర మోదీ చేస్తున్నారంటు విగ్యంగా వ్యాఖ్యానించారు.

ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపిద్దాం

బళ్లారిరూరల్, మే 4 : బళ్లారి నగరంలో ఉరవకొండ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ సతీమణి హేమలత, తనయులు విక్రమ్ సింహా, విజయ్‌సింహాలు బళ్లారికి విచ్చేశారు. ఈ సందర్భంగా బళ్లారి చెక్‌పోస్టు వద్ద కమ్మ కులబాంధవులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని పూలు, శాలువాలతో ఘన స్వాగతం పలికారు. బళ్లారి విద్యానగర్‌లో నివాసం వుంటున్న ఉరవకొండ నియోజకవర్గ కమ్మ కులబాంధవులను కలిసి టీడీపీ కూటమిని గెలిపించాలని కోరారు. అనంతరం ఓటర్లను కలసి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. విద్యానగర్, కాకర్లతోట వద్ద గల కమ్మసంఘం సభ్యులు వారిని తమ ఇళ్లకు ఆహ్వానించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకట నాయుడు, మల్లికార్జున, లాల్‌మోహన్, రామాంజి, నాని, కిష్టప్ప, సంజప్ప, హనుమంతు, రఘు, రంగయ్య, మంజునాథ్, శీనప్ప, పలువురు కమ్మ కులబాంధవులు తదితరులు పాల్గొన్నారు.



కేశవ్ కుమారుడిని స్వాగతిస్తున్న కమ్మకులబాంధవులు

హోసూరు జోన్

పాఠశాల నిర్వాహకుల సమావేశం



ప్రత్యేక పాఠశాల నిర్వాహకుల సమావేశ దృశ్యం

హోసూరు, మే 4: హోసూరు విద్యా జిల్లా కమందొడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రత్యేక పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి ప్రిన్సిపాల్ రఘు అధ్యక్షత వహించారు. సమావేశానికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షురాలు శ్రీల అధ్యక్షత వహించారు. సమావేశంలో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు కొత్త విద్యాసంవత్సరానికి ఉన్నత విద్యాభ్యాసానికి సంబంధించిన అడ్మిషన్లు, మార్గదర్శకాలు, డ్రాపౌట్‌లను గుర్తించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించడం వంటి అంశాలపై రాబోయే విద్యాసంవత్సరానికి కొత్త కార్యక్రమాలను రూపొందించడంపై చర్చించారు. సమావేశంలో 2022-2024 విద్యాసంవత్సరంలో పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేసిన పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులకు ప్రధానోపాధ్యాయులు జ్ఞాపికలు అందజేశారు.

నేడు డీఎంకే బహిరంగ సభ

హోసూరు, మే 4: ద్రావిడ కళగం తరపున భారత గణతంత్ర శతాబ్ధి ఉత్సవాల్లో భాగంగా 5న ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు హోసూరు రాంనగర్ అన్నా విగ్రహం వద్ద బహిరంగసభ జరగనుంది. డీఎంకే పశ్చిమ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై ప్రకాశ్ నేతృత్వం వహించనున్నారు. సమావేశంలో మాజీ శాసనసభ్యులు, పార్టీ జిల్లా పరిపాలకులు, నగర యూనియన్, బారూరు ఏరియా కార్యదర్శులు, నిర్వాహకులు, రాష్ట్ర జిల్లా నగర యూనియన్ బారూరు ఏరియా టీమ్ లీడర్లు నిర్వాహకులు తదితరులు పాల్గొననున్నారు.

267 కిలోల గుట్కా స్వాధీనం

హోసూరు (క్రైం), మే 4: కర్ణాటక నుంచి వేలూరుకు కారులో తరలిస్తున్న 267 కిలోల గుట్కా, మద్యం బాటిళ్లను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హోసూరు తాలూకా ఎస్సై శివకుమార్, పోలీసులు నరసింహ టెంపుల్ జంక్షన్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కారు ఆపకుండా వెళ్లిపోయింది. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు కారును వెంబడించారు. ఇలా ప్రయత్నిస్తుండగా డ్రైవర్ ఓ చోట కారును రివర్స్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా అదుపు తప్పిన కారు కాలువలో పడింది. ఆ తర్వాత డ్రైవర్ దిగి పారిపోయాడు. పోలీసులు కారును సోదా చేయ్యగా అందులో 267 కిలోల నిషేధిత పొగాకు ఉత్పత్తులైన హాన్స్, పాన్ మసాలా ఉన్నాయి. వాటి విలువ రూ.1.05 లక్షలుగా ఉంటుందన్నారు. అదే విధంగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన 96 మద్యం ప్యాకెట్లు ఉన్నాయి. వాటి విలువ రూ.3వేలు ఉంటుందని తెలిసింది. గుట్కా, మద్యం ప్యాకెట్లు, కారును పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పరారైన డ్రైవర్‌కోసం గాలింపు చేపట్టారు.

వడదెబ్బకు నలుగురి మృతి..!

రాయచూరు, మే 4 : జిల్లాలోని సింధనూరు తాలూకా ముక్కుంద గ్రామ పంచాయతీ పరిధిలోని హుడా గ్రామంలో ఒకే రోజు(శనివారం) ఎండవేడి తాళలేక నలుగురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. వీరిలో ఒక బాలుడు కాగా మిగతా వారంతా వయోవృద్ధులే కావడం గమనార్హం. గత రెండు రోజులుగా వేడిగాలులతో పాటు ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోవడంతోనే ఈ మరణాలు సంభవించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామానికి చెందిన వీరేశ్ మడివాళ్ గ్రామ సమీపంలోని వాగులో బట్టలు ఉతకేందుకు వెళ్లి వచ్చిన అనంతరం అస్వస్థతకు గురై అక్కడే కుప్పకూలి మృత్యువాతపడ్డాడు. మిగతా ముగ్గురు 15 ఏళ్ల ప్రదీప్, 60 ఏళ్ల దేవాదాసీ మహిళ గంగమ్మ మరో 50 ఏళ్ల ఉప్పార వీరేశ్ఎండవేడికి మృత్యువాతపడ్డారు. వీరంతా వీళ్లల్లోనే ఉండి అస్వస్థతకు గురై కొద్ది గంటల్లోనే మృత్యువాతపడడం ఒక్కసారిగా గ్రామంలో విషాదాన్ని నింపడంతో పాటు భయాందోళనలను రేకెత్తించింది. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆశ్చర్యానికి గురి కావడమేగాక హుడా గ్రామాన్ని సందర్శించి మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్నారు. విషయం తెలుసుకున్న సింధనూరు రూరల్ పోలీసులు, రెవెన్యూ అధికారులు గ్రామాన్ని సందర్శించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాలూకా ఆస్పత్రికి తరలించారు.

రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు



కార్యకర్తల సభలో మాట్లాడుతున్న అణ్ణామలై

రాయచూరు, మే 4 : భారత రాజ్యాంగాన్ని గురించి మాట్లాడే నైతిక అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అణ్ణామలై అన్నారు. రాజ్యాంగపు విలువలను ఇనుమడింప చేస్తూ సుస్థిర సుపరిపాలన అందిస్తున్న నరేంద్ర మోదీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వంలో భాగంగా శనివారం రాయచూరు నగరంలోని ఒక ప్రైవేటు హోటెల్‌లో బీజేపీ దాన్ని మిత్ర పక్షం జేడీఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన అణ్ణామలై, కాంగ్రెస్ పార్టీది తిరోగమన విధానమని, నరేంద్ర మోదీది పురోగమన విధానమన్నారు. 10 ఏళ్ల నరేంద్ర మోదీ పాలనలో ప్రపంచంలో భారత దేశం ఐదవ ఆర్థిక శక్తివంత దేశంగా నిలిచిందన్నారు. 2040 నాటికి దేశం ప్రపంచంలో మూడవ ఆర్థిక శక్తిగా నిలుస్తుందని మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం చెబుతున్నారని కాని బీజేపీ పాలనలో అది ఒకటవ స్థానంకి చేరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీకి అన్ని వర్గాలు, అన్ని మతాలకున్న సమాన భావం ఉందని ముస్లి మైనార్టీకి చెందిన ఏపీజే అబ్దుల్ కలాంను అనంతరం రామ్‌నాథ్ కోవిందను, ద్రౌపది ముర్మును అత్యున్నత పదవి రాష్ట్రపతి స్థానంలో కూర్చబెట్టిన ఘనత బీజేపీదేనన్నారు.

అణ్ణామలై సభలో గందరగోళం

రాయచూరు, మే 4 : లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థి తరఫున ప్రచారం చేసేందుకు శనివారం రాయచూరు నగరానికొచ్చిన తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అణ్ణామలై పాల్గొన వేదిక వద్ద రసబస చోటుచేసుకుంది. బీజేపీ దాని మిత్రపక్షం జేడీఎస్ నాయకులు కార్యకర్తలతో శనివారం నగరంలోని ఒక ప్రైవేటు హోటెల్‌లో సమావేశం నిర్వహించగా వేదిక పై అణ్ణామలై ప్రసంగం అనంతరం ఆయనను కలిసి సెల్ఫీ దిగేందుకు దండలు వేసేందుకు బీజేపీ కార్యకర్తలు పోటీ పడ్డారు. ఒక దశలో పెద్ద సంఖ్యలో వేదిక పై చొచ్చుకుపోయిన కార్యకర్తలను కిందికి దించేందుకు బీజేపీ-జేడీఎస్ నాయకులు చేసిన ప్రయత్నం విఫలం కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. రద్దీ తగ్గకపోవడంతో గత్యంతరం లేకా పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి చేసి చెదరగొట్టారు.